క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహార ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు వివరించాలని సర్పంచ్ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారంతో పాటు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. పౌష్టికాహారంపై అసత్య ప్రచారాలు నిర్వహించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదని ఆయన అన్నారు.

టెంట్ వితరణ



ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం గ్రామానికి చెందిన హాజీపాష జ్ఞాపకార్థం అతడి కుమారుడు ఉజేర్ అహ్మద్ మండలంలోని మామిడిమాడ మజీద్‌కు ఉసూల్ టెంట్ (మజీద్‌లో స్నానం కోసం ఉపయోగించే టెంట్) అందజేశారు. సుమారు రూ.25 వేల విలువ చేసే టెంటు అందజేయడంతో అహ్మద్ మజీద్ పెద్దలు అబ్జల్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఇజాస్, ఎక్బాల్, ఖాజ, శాబుద్దీన్, అజర్, ఉస్మాన్, సీరాజ్, ఖదీర్, అబ్జల్, మైబు తదితరులు పాల్గొన్నారు.

భూలక్ష్మమ్మకు పూజలు



వనపర్తి: స్థానిక రాంనగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన భూలక్ష్మమ్మ దేవీ శ్రావణమాసం పూజా కార్యక్రమాన్ని కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి కౌన్సిలర్ పుట్టపాకుల మహేష్‌తో పాటు మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం, తిరుమల్ హాజరయ్యారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈ పూజలకు కాలనీలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై చల్లంగా చూడమ్మ అంటూ మొక్కులు తీర్చుకున్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి



పెబ్బేరు రూరల్: వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ యూత్ మండల కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని అంకూర్, చిమనగుంటపల్లి, వెంకటాపూర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా యువతను కలుస్తూ ఈ నెల 5 జిల్లా కార్యాలయంలో నిర్వహించే యూత్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షుడు చిట్యాల రాము, మండల కార్యదర్శి సంపత్‌కుమార్‌రెడ్డి, మండ్ల కురుమూర్తి, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి



అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కకు నీటిని అందించాలని ఎంపీఓ నరసింహులు అన్నారు. చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మస్తీపురంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందించారు. ఈమేరకు పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ మొక్కల కోసం తవ్విన గుంతలలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ఏఎన్‌ఎంల వినూత్న నిరసన

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణ నుంచి రెండో ఏఎన్‌ఎంలు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష‌తో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణ సముదాయాలను తిరుగుతూ బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా తమ మద్దతు ప్రకటించాలని ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు, ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, లక్ష్మమ్మ, రమ, లక్ష్మి, ఉమ, ఉమామహేశ్వరి, శాంత, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.



ఓటుహక్కుతోనే భవిష్యత్

వనపర్తి: 18 ఏళ్ల వయస్సు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్ సూచించారు. శుక్రవారం 33వ వార్డు వల్లభ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఓటరు నమోదుపై యువతకు అవగాహన కల్పించటంతో పాటు ఫారం–6ను అందజేశారు. ఈ సందర్భంగా యువతకు ఓటుహక్కు ప్రాముఖ్యత, విలువను తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దేశవ్యాప్తంగా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగాన్ని పెంచటానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతోందనినాన్నరు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ అలేఖ్య, మాజీ కౌన్సిలర్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ నూతన ఓటర్‌గా నమోదు చేసుకోవడం, ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం మండల కేంద్రంలోని దళితవాడలో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఓటర్ జాబితాలో తప్పులు దొర్లితే సంబంధిత అధికారుల ద్వారా వాటిని వెంటనే సరి చేయించుకోవాలని సమైక్య సీసీ వీరయ్య, బుక్ కీపర్ ఈశ్వరయ్య సూచించారు. ప్రతి మహిళా ఓటు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో యువతకు ఓటరు నమోదు ఫారం అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ రమేష్‌గౌడ్

ఓటర్ నమోదు కేంద్రాలు..

నూతన ఓటర్ నమోదు కోసం రెండు రోజులపాటు ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్‌ఐ కురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: కొత్త ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేర్లలో ఉన్న తప్పొప్పులను సవరించేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శని, ఆది వారాలు ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటయ్య పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కొండల్‌రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధ, డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

కొత్తకోట: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఓటు నమోదు కార్యక్రమంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశినితో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్ వినియోగంపై అవగాహన

పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో ఈవీఎం ఓటింగ్ మిషన్, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల అధికారి, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ సూచించారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు 18ఏళ్లు నిండిన యువత, ప్రతి ఓటరుకు ఎలాక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరు, పరిశీలినపై కళాజాతా బృందంచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, కారోబార్ సుగుణబ్రహ్మం, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడంలో..



ఖిల్లాఘనపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



అమరచింతలో..



కొత్తకోటలో..

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. మండలంలోని చంద్రనాయక్‌తండాలో శుక్రవారం సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తండాల్లోని ప్రజలు ప్రతి ఇంటింటా చందాలను పోగు చేసుకొని తమ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్పాశంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ షెక్షావలీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



వనపర్తి టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని న్యాయవాది ఎన్ బాలనాగయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని బాధితులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసాచారి, ఉత్తరయ్య, సఖీ కేంద్రం నిర్వాహకులు కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ ఆగడాలను ఎండగట్టాలి

చిన్నంబావి: అధికార పార్టీ ఆగడాలను సోషల్‌మిడియా వేదికగా ఎండగట్టాలని మాజీ మంత్రి జూపలి కృష్ణరావు తనయుడు జూపల్లి అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదేళ్లలో జరిగిన అవినీతి, అధికార పార్టీ నాయకుల భూకబ్జాలు, ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు, హత్య రాజకీయాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా జూపల్లి చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లేరేషన్‌ను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల సమయం తక్కువగా ఉందని, ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడ్డ వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని, ఎవరూ అధైర్య పడకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్ యాదవ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ విద్యాసాగర్ రావు, సర్పంచ్ రంజిత్‌కుమార్, తేజారెడ్డి, గూడెం సుధాకర్, ఎంపీటీసీ మహదేవ్‌గౌడ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూపల్లి అరుణ్

పేదల సంక్షేమమే లక్ష్యం

వీపనగండ్ల: బడుగు బలహీన వర్గాలకు మేలు జరగాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కొర్లకుంటలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమైక్య రాష్ట్ర సీఎంగా పనిచేసిన ఎన్‌టీ రామారావు పేదల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని, ఆ పథకాలు మళ్లీ అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేసే తనకు రాబోయే ఎన్నికల్లో మద్దతు తెలిపాలని ఆయన కోరారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి

అమరచింత: పద్మశాలీల సంఘం పట్టణ నూతన అధ్యక్షుడిగా మహంకాళి విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్త మార్కండేయ ఆలయంలో శుక్రవారం పద్మశాలీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పారుపల్లి సత్యం, ప్రధాన కార్యదర్శిగా మహంకాళి ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సిల్వరి రాములు, పోతు శ్రీధర్, కోశాధికారిగా సంబారి మాదన్న, తిరుమల సత్యనారాయణతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా నియమించారు.

ఆన్‌లైన్‌లో పంటల నమోదు తప్పనిసరి

పెబ్బేరు: మండలంలోని పెంచికలపాడు, బుడిదపాడు గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సుధాకర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మిరప, వేరుశనగ పంటలను పరిశీలించారు. వేరుశనగ పంట పూత దశలో ఉందని, పంట అనేది బట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలన్నారు. నూనె శాతం పెరిగేందుకు ఎకరాకు 200 కేజీల జిప్సం లేదా క్యాల్షియం అందించాలని సూచించారు. అలాగే మిరప పంటకు తామర, ఆకుముడత, రసం పీల్చే తెగుళ్లు వస్తుండడంతో నాటిన 15 నుంచి 45 రోజులకు ఎకరాకు 8 కిలోలు ఫిప్రోనిల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్‌కుమార్, రైతులు మహబూబ్ పాషా, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అన్వర్, వెంకటయ్య, మన్నెం పాల్గొన్నారు.



బూడిదపాడు శివారులో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

దేశ ప్రజలంతా ఒక్కటే

వనపర్తి టౌన్: కుల, మతాలకు తావు లేకుండా దేశ ప్రజలందరూ ఒక్కటే అనడానికి ప్రతీకగా ప్రధాన మంత్రి మోదీ మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమానికి పిలుపునిచ్చారని బీజేపీ నాయకులు బి కృష్ణ, వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో, ఆర్మీ కుటుంబాల్లో, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాల్లో, తెలంగాణ కోసం పోరాడి ప్రాణాలు విడిచిన ఇళ్ల, ప్రతి ఒక్క ఇంటి నుంచి సేకరించిన మట్టితో జవాన్ల స్మృతికి చిహ్నంగా మొక్కలను స్వయంగా మోదీ నాటనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, పరశురాం, రాము, పద్మమ్మ, కుమార్‌స్వామి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రధాని నరెంద్రమోదీ పిలుపు మేరకు మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

తాగునీటి ఇబ్బందులు రానివొద్దు

అమరచింత: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించడంలో మున్సిపల్ పాలక వర్గంతో పాటు మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని నాలుగు, ఆరో వార్డులో కొన్ని నెలలుగా తాగునీటి ఎద్దడి ఏర్పడటం, అక్కడి సోర్స్ బోర్లు మరమ్మతుకు గురికావడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు కలిగాయన్నారు. ప్రస్తుతం వాటిని మరమ్మతు చేయించి ఆయా వార్డులకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని పది వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి ప్రతి నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నామని, కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్‌ల మూలంగా నీటి సరఫరా ముందుకు వెళ్లడం లేదని విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించామన్నారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు టాప్‌పై ప్రయాణం ప్రమాదం

పాన్‌గల్: కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఉదయం వేళల్లో పాన్‌గల్ మీదుగా వనపర్తికి వెళ్లేటప్పుడు సమయపాలన లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల, జిల్లా కేంద్రానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వచ్చిన బస్సులో ప్రయాణికులతో రద్దీగా ఉండడంతో తప్పని పరిస్థితుల్లో బస్సు టాప్‌పై ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. బస్సు టాప్‌పై ప్రయాణంతో విద్యుత్ వైర్లు తగిలి ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఉదయం వేళల్లో బస్సులు సమయపాలన పాటించే విధంగా తగు చర్యలు తీసుకుంటూ బస్సు టాప్‌పై ప్రయాణించకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. బస్సుటాప్‌పై ప్రయాణించే దృశ్యం పాన్‌గల్‌లో శుక్రవారం కనిపించింది.



పాన్‌గల్‌లో ఆర్టీసీ బస్సు టాప్ పైకి ఎక్కిన ప్రయాణికులు

నిల్వ నీటితోనే రోగాలు

పాన్‌గల్: నిల్వ నీటితో రోగాలు సంభవిస్తాయని, దీంతో వారానికి ఒకసారి అయినా నిల్వ నీటిని పారబోసి కొత్త నీటిని పట్టుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి అన్నారు. డ్రై డే ఫ్రై డేలో భాగంగా శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో వైద్య సిబ్బందితో పర్యటించి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది రోగాలు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దీంతో పాటు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, చెమటలు పట్టడం, కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ అధికారి రామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ సుమనశ్రీ, రాంచందర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీపీఎస్‌ను రద్దు చేయాలని వినతి



కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

వనపర్తి టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జేఏసీటీఓ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో ఎస్‌టీయూటీఎస్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అదేవిధంగా జేఏసీటీఓ నాయకులు కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి భానుప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతికి జీఓ 302ను పునరుద్ధరించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌యూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాస్‌రావు, జేఏసీటీఓ నాయకులు ఈశ్వర్‌గౌడ్, రెడ్డి, నరసింహారావు, మధుసూదన్ గుప్తా, వెంకటేశ్వర్లు, ఆనంద్, గురురాజు, శివస్వామి, చంద్రశేఖర్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌తో నష్టాలే

సీపీఎస్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టాలు తప్పవని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో సీపీఎస్ విద్రోహ దినాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు భగవంతు, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాకేష్‌గౌడ్, రవికుమార్, డాకేష్‌గౌడ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం తపస్ ఆధ్వర్యంలో కొత్తకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారని, సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలకొండయ్య, రాఘవేంద్రచారి, అరవింద్‌రెడ్డి, శివనారాయణ, రాములు, లక్ష్మయ్య, తిరుపతినాయక్, సురేందర్, నరేందర్‌గౌడ్, వెంకటేష్, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 2003 సెప్టెంబర్ 1 నుంచి అమలు చేస్తున్న కాంట్రిబ్యూటరి పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఉపాధ్యాయుల సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. సెప్టెంబర్ 1న విద్రోహక దినాన్ని పాటిస్తూ పీఆర్‌టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజుకు అందించారు. కార్యక్రమంలో రాఘవేందర్, విజయ్, సత్యం, సత్యనారాయణ, దోమ శ్రీను, రాజు, శ్రీరాములు, సత్యన్న, శ్రీరామ్, వగ్గ ఉమాశంకర్, విజయభాస్కర్‌రెడ్డి, నారాయణ, శాంతన్న, వెంకటన్న, శ్రీనివాస్, భాస్కర్, అనురాధ, సుమతి, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలి

పాన్‌గల్: కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని రేమద్దుల బస్టాండ్ చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర సరుకులతో పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు సరైన కూలి అందజేయాలని, యువతకు ప్రతి ఏటా ఇస్తామన్నా 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అసంఘటిత కార్మికుల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, భగత్, మల్లేష్, వెంకటయ్య, ఖాజా, భాస్కర్‌గౌడ్, బాలకిషన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

వీపనగండ్ల: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, నిరుద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారని, ఉపాధి కూలీ పథకానికి నిధులు తగ్గించడం లాంటి చర్యలు తీసుకోవడం వల్ల కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత నెలకొని ఉందని సీపీఎం జిల్లా నాయకులు రాజు, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, నవీన్, రాముడు, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.



రేమద్దులలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని సీపీఎం జిల్లా నాయకులు జీఎస్ గోపి, అజయ్, వెంకటేష్, ఆర్‌ఎన్ రమేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వాల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బుచ్చన్న, శ్యాంసుందర్, చంటి, రవి పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన ప్రైవేట్ టీచర్ కృష్ణయ్య (60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కృష్ణయ్య మరణించాడన్న విషయం తెలుసుకున్న 2004–05లో కృష్ణయ్య దగ్గర పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆయన ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కృష్ణయ్య భార్యకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాటి కరస్పాండెంట్ సురేష్, పూర్వ విద్యార్థులు అనిల్ సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రామకృష్ణ, ఖదీర్, సంపత్, శివనాయక్, నర్సింహారెడ్డి, మహేష్, దీన్‌దయాల్, రాజశేఖర్, బాలకృష్ణ ఉన్నారు.

కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని సెయింట్‌థామస్ పాఠశాల సమీపంలో బెల్టు షాపుపై దాడి చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై శుక్రవారం పట్టణ పోలీసులు దాడులు నిర్వహించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణం కేంద్రంలోని సెయింట్‌థామస్ పాఠశాల సమీపంలో టీ స్టాల్‌లో పున్యానాయక్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పోలీసులు సోదాలు చేయగా 6 విస్కి, 8 బీరు బాటిళ్లు దొరికాయి. దీంతో పున్యానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.